## నస్పూర్‌లో రూ.3 లక్షలు స్వాధీనం

సీసీసీ నస్పూర్, అక్టోబర్ 16 : సీసీసీ నస్పూర్‌లో ఎస్ఐ సంతోష్ ఆధ్వర్యంలో సిబ్బంది సీసీసీ రాయల్ టాకీస్ ఏరియాలో సోమవారం వాహనాల తనిఖీ చేపట్టారు. పోతురాజుల మల్లేశ్ నుంచి రూ.2 లక్షల 10 వేలు, పసుపునూరి శంకర్ వద్ద రూ.లక్ష పట్టుకున్నారు. ఈ నగదుకు సంబంధించి ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో సీజ్ చేసి, ఫ్లయింగ్ స్క్వాడ్ టీంకు అప్పగించారు.


పట్టుకున్న నగదుతో పోలీసులు

# హస్తంలో అసమ్మతి



■ **టికెట్ ఆశించి భంగపడిన వారితో కొత్త చిక్కులు**

మంచిర్యాల, అక్టోబర్ 16(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : అభ్యర్థుల ప్రకటనతో కాంగ్రెస్ పార్టీలో అసమ్మతి సెగలు రాజుకుంటున్నాయి. మంచిర్యాల, బెల్లంపల్లిలో కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యే టికెట్ ఆశించి భంగపడిన పలువురు నాయకులు తలనొప్పిగా మారారు. మంచిర్యాల అభ్యర్థి ప్రేమ్‌సాగర్‌తో పాటు బీసీ నినాదంతో కాంగ్రెస్ పార్టీలో చేరిన నీలకంఠేశ్వర్‌గౌడ్, పార్టీలో సీనియర్‌గా ఉంటూ వస్తున్న కేవీ ప్రతాప్, లక్సెట్టిపేట జడ్పీటీసీ ముత్తె సత్తయ్య వీరంతా టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. ముందు నుంచి రేవంత్‌రెడ్డిని సపోర్ట్ చేస్తూ ఆయన వర్గంగా మంచిర్యాలలో పనులు చేసుకుంటూ వెళ్తున్నారు. ఇప్పుడు వారిని కాదని భట్టి విక్రమార్క వర్గానికి చెందిన పీఎస్ఆర్‌కు టికెట్ రావడంతో మిగిలిన నాయకులు గుర్రుగా ఉన్నారు. టికెట్ ప్రకటించడానికి రెండు, మూడు రోజుల ముందే కేవీ ప్రతాప్, అంతకు ముందే ముత్తె సత్తయ్య పీఎస్ఆర్‌కు వ్యతిరేకంగా కార్యకర్తలు, సన్నిహితులతో ఎవరికి వారు సమావేశాలు నిర్వహించారు. తమను కాదని పీఎస్ఆర్‌కు టికెట్ ఇస్తే సహాయ నిరాకరణ చేయాలనే నిర్ణయానికి వచ్చినట్లు విశ్వసనీయంగా తెలిసింది. అదే జరిగితే సొంత పార్టీలోని కీలక నాయకుల నుంచే పీఎస్ఆర్‌కు ఎదురుదెబ్బ తగలనుంది. పైగా ఇప్పటికే రేవంత్‌రెడ్డి అంటే పీఎస్ఆర్‌కు పడదనే ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో రేవంత్ అభిమాన వర్గం పీఎస్ఆర్‌కు వ్యతిరేకంగా పనిచేసే పరిస్థితి కనిపిస్తున్నది.

**బెల్లంపల్లిలో పెద్ద తలల కొట్లాట..**

బెల్లంపల్లిలో విచిత్రమైన పరిస్థితి ఉంది. ఇక్కడ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గడ్డం వినోద్‌కు మంచిర్యాల అభ్యర్థి ప్రేమ్‌సాగర్‌రావుకు పడడం లేదు. ఈ మధ్యే పీఎస్ఆర్ తనకు డబ్బులు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారని గడ్డం వినోద్ రూ.25 లక్షలకు చెక్ బౌన్స్ కేసు వేశారు. లీగల్ నోటీసులు పంపించారు. దీంతో అప్పటి నుంచి ఇద్దరి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటోంది. గడ్డం వినోద్‌ను కాదని పీఎస్ఆర్ ముందు నుంచి బెల్లంపల్లిలో తన వర్గాన్ని ప్రోత్సహిస్తూ వచ్చారు. నాతరి స్వామి, చిలుముల శంకర్, రొడ్డ శారద, ముడిమడుగుల మహేందర్ వీరంతా పీఎస్ఆర్ మనుషులుగా జనంలోకి వెళ్లారు. కొన్ని నెలల క్రితం నాతరి స్వామి కాంగ్రెస్ అభ్యర్థి అంటూ విస్తృతమైన ప్రచారం జరిగింది. భట్టి పాదయాత్రతో ఇక ఫైనల్ అయిపోయినట్లే అని చెప్పారు. నాన్‌లోకల్‌లో ఉండే వినోద్‌కు బదులు ఈయనకు టికెట్ ఇస్తే బాగుంటుందనే చర్చ జరిగింది. తీరా ఇప్పుడు అధిష్ఠానం గడ్డం వినోద్‌కు టికెట్ ఇవ్వడంతో పీఎస్ఆర్ వర్గం అట్టుడికిపోతోంది. వినోద్‌కు మద్దతు ఇచ్చే పరిస్థితి కనిపించడం లేదు. పీఎస్ఆర్ వర్గంలో ముఖ్యమైన వారంతా బెల్లంపల్లి టౌన్‌కు చెందిన వారే కావడంతో గడ్డం వినోద్‌కు కాస్తో, కూస్తో పట్టున్న బెల్లంపల్లి లోనూ ప్రభావం కోల్పోయే దుస్థితి నెలకొంది.

**ఆశావహుల పక్కచూపులు..**

మంచిర్యాల, బెల్లంపల్లి నియోజకవర్గాల్లో కాంగ్రెస్ టికెట్ ఆశించిన నాయకులు ఇప్పుడు పార్టీ కోసం పని చేసే ఉద్దేశంతో లేనట్లు కనిపిస్తోంది. మంచిర్యాలకు చెందిన కొందరు నాయకులు వేరే పార్టీల్లో చేరేందుకు సిద్ధమవుతున్నారు. ఏ పార్టీ లేకపోతే ఏదో గుర్తుపై పోటీ చేయాలని చూస్తున్నారు. మంచిర్యాల నియోజకవర్గంలో కీలక నేత ఒకరు బీఆర్ఎస్‌తో సంప్రదింపులు జరుపుతున్నారు. మరొకరు వేరే పార్టీతో టచ్‌లోకి వెళ్లారు. బీసీ నినాదంతో పార్టీలోకి వచ్చిన నాయకుడు బీసీలు అందరూ కలిసి పార్టీలకు అతీతంగా పోటీ చేస్తే తానే అభ్యర్థి అవ్వాలని పావులు కదుపుతున్నారు. ఈ నేపథ్యంలో మంచిర్యాలలో కాంగ్రెస్ పార్టీ పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. గ్రూపు రాజకీయాల తో కిందిస్థాయి నాయకులు, కార్యకర్తలు తలలు పట్టుకుంటున్నారు. బెల్లంపల్లిలో పీఎస్ఆర్ వర్గీయులు స్వతంత్రంగా లేదా టికెట్ వచ్చిన పార్టీలోకి వెళ్లి పోటీ చేయాలని చూస్తోంది. పొత్తుల్లో భాగంగా చెన్నూర్ టికెట్ సీపీఐకి ఇస్తారనే ప్రచారం జరుగుతుండడంతో ముందు నుంచి కాంగ్రెస్ కోసం కష్టపడుతున్న నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏదేమైనా పోటీలో ఉంటామని ఒకరిద్దరు ఇప్పటికే లీకులు ఇస్తున్నారు. సొంత పార్టీ నేతలే తిరుగుబాటు చేస్తున్న పరిస్థితుల్లో కాంగ్రెస్ ఎన్నికల్లో పోటీ చేస్తే ఇబ్బందులు తప్పవనే గుసగుసలు వినిపిస్తున్నాయి.

## ‘ఓపెన్’ పరీక్షలు షురూ..

మంచిర్యాల అర్బన్, అక్టోబర్ 16 : జిల్లాలో ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఇందుకోసం అధికారులు జిల్లాకేంద్రంలో రెండు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. పదో తరగతి పరీక్ష కోసం జిల్లాకేంద్రంలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలను కేటాయించగా 58 మంది విద్యార్థులకు 43 మంది హాజరు కాగా, 15 మంది గైర్హాజరైనట్లు డీఈవో యాదయ్య తెలిపారు. ఇంటర్మీడియట్ కోసం జిల్లాకేంద్రంలోని చెన్నూర్ రోడ్ సాయికుంటలోని ప్రభుత్వోన్నత పాఠశాలను కేటాయించగా, 108 మంది విద్యార్థులకు 71 మంది పరీక్ష రాయగా 37 మంది గైర్హాజరయ్యారన్నారు. పరీక్షా కేంద్రాలను ఏసీజీఈ దామోదర్ సందర్శించారు. ఇదిలాఉంటే జిల్లా కేంద్రంలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల కేంద్రంలో ఒక విద్యార్థికి బదులు మరొకరు పరీక్షకు హాజరు కాగా తమ సిబ్బంది గుర్తించి పట్టుకున్నట్లు డీఈవో యాదయ్య తెలిపారు. సదరు విద్యార్థిపై కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

## చెరువులో దూకి ఉపాధ్యాయురాలు ఆత్మహత్య


తిరుమలేశ్వరి (ఫైల్)

చెన్నూర్ టౌన్, అక్టోబర్ 16 : చెన్నూర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్న తిరుమలేశ్వరి (35) ఆత్మహత్య పట్టణంలో విషాదం నింపింది. బాధిత కుటుంబసభ్యులు తెలిపిన ప్రకారం.. మంచిర్యాల జిల్లా నస్పూర్ మండలానికి చెందిన తిరుమలేశ్వరి చెన్నూర్‌లోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. ప్రిన్సిపాల్, తోటి ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయురాలు, ఏసీటీ, పీఈటీలతో పాటు బోధన సిబ్బంది వేధింపులు, పని ఒత్తిడి, వేధింపులు తాళలేక స్థానిక పెద్ద చెరువులో సోమవారం దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు బాధిత కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ మేరకు సంబంధిత విషయాలను తెలుపుతూ ఆమె మాట్లాడిన ఆడియో కలకలం రేపుతున్నది. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకొని, చెరువు నుంచి మృతదేహాన్ని వెలికితీశారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. బాధితులపై చర్య తీసుకునేదాకా పోస్టు మార్టం చేయవద్దని, బాధితురాలి సోదరుడు, కుటుంబ సభ్యులు స్థానిక దవాఖాన ఎదుట ఆందోళన చేశారు. వేధింపులకు గురిచేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

## పురుగుల మందు తాగి..

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్,అక్టోబర్ 16 : మండలంలోని బూరుగూడ గ్రామానికి చెందిన లోనరే సురేశ్ (30) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. సురేశ్ మద్యానికి బానిసయ్యాడు. దీనికితోడూ ఇంట్లో డబ్బుల కోసం గొడవ పడుతుండేవాడు. శుక్రవారం మద్యం మత్తులో ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే సర్కారు దవాఖానకు తరలించారు. మెరుగైన చికిత్స కోసం మంచిర్యాలలోని ఓ ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడని తెలిపారు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# పోలింగ్ కేంద్రాల పరిశీలన


నెన్నెల : దివ్యాంగురాలికి ఫారం 12డీ అందజేస్తున్న మంచిర్యాల అదనపు కలెక్టర్ రాహుల్

నెన్నెల, అక్టోబర్16 : మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను అదనపు కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాహుల్ సోమవారం సందర్శించారు. నెన్నెల, జంగాల్‌పేట గ్రామాల్లో కేంద్రాల్లో సదుపాయాలను పరిశీలించి ఓటర్లకు సరిపడా సౌకర్యాలు ఉన్నాయా.. అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఓటు హక్కు వినియోగించుకునే వీలులేని వృద్ధులు, దివ్యాంగుల కోసం ఏర్పాటు చేయాల్సిన సదుపాయాలను బీఎల్వోలకు వివరించారు. ఫారం -12 డీ నింపి వారికి అందజేయలన్నారు. ఓటు హక్కు ఉంచి కేంద్రానికి వెళ్లలేని వారిని ముందుగానే గుర్తించి వారికి తగు ఏర్పాట్లు చేయాలని , ఇందుకోసం ప్రత్యేక ఎన్నికల టీంను ఏర్పాటు చేస్తామన్నారు. కదల్లేని వారి ఇంటికే ప్రత్యేక టీం వెళ్లి అక్కడే ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఓటరు జాబితాలో తప్పులేకుండా చూడాలన్నారు. దివ్యాంగులు, 80 ఏళ్ల పై బడిన ఓటు హక్కు ఉన్న వారి ఇంటికి వెళ్లి వారి స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. కేంద్రానికి వెళ్లి ఓటు వేస్తావా..? అని అడిగి తెలుసుకున్నారు. ఆటోలు పెడితే ఓటు వేస్తామని కొందరు, ఇంటికి వస్తే వేస్తామని కొందరు అదనపు కలెక్టర్‌కు చెప్పారు. తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్, ఎంపీడీవో వరలక్ష్మి, ఎస్ఐ శ్యాంపటేల్ , ఆర్ఐ గణేశ్, బీఎల్వోలు ఉన్నారు.

**ఇంటి నుంచే ఓటు హక్కు..**

హాజీపూర్, అక్టోబర్ 16 : దివ్యాంగులు, 80 ఏళ్లు దాటిన సీనియర్ సిటిజన్స్‌కు ఇంటి నుంచే ఓటు హక్కు వినియోగించుకునే అవకాశాన్ని ఎన్నికల సంఘం కల్పించిందని హాజీపూర్ మండల తహసీల్దార్, ఎన్నికల సహాయ అధికారి సతీశ్‌కుమార్ అన్నారు. మండలంలోని రాపల్లి పునరావాస కాలనీలో వృద్ధులు, దివ్యాంగులకు ఫాం 12లను సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ ప్రభుతో పాటు బీఎల్వోలు పాల్గొన్నారు.

# బీజేపీ ప్రలోభాలు షురూ..

- **మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ ఇంట్లో దొరికిన 720 చీరలు**
- **ఆదివారం అర్ధరాత్రి తనిఖీ చేసి సీజ్ చేసిన పోలీసులు**

మంచిర్యాల అర్బన్, అక్టోబర్ 16 : ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలనే లక్ష్యంతో బీజేపీ నాయకులు అడ్డదారితొక్కడం ప్రారంభించారు. కోడ్ వెలువడిన తర్వాత కూడా ఓటర్లను ప్రలోభాలకు గురి చేసేందుకు యత్నిస్తున్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెర్రబెల్లి రఘునాథ్ ఇంట్లో 720 చీరలు ఉన్నాయన్న విషయం ఎన్నికల అధికారులకు తెలియడంతో పోలీసుల సహాయంతో ఆదివారం అర్ధరాత్రి తనిఖీలు చేపట్టి వాటిని స్వాధీనం చేసుకున్నారు.

**మరో వర్గం సమాచారంతోనే దాడులు..?**

జిల్లా అధ్యక్షుడి ఇంట్లో ఎన్నికల సిబ్బంది, పోలీసులు దాడులు బీజేపీలోని అంతర్గత విభేదాలే కారణమని పలువురు నాయకులు చర్చించుకుంటున్నారు. మహిళా ఓటర్లకు పంచేందుకు దాచి ఉన్న చీరల సంగతి బయటకు ఎలా పొక్కిందని మాట్లాడుకుంటున్నారు. రెండు వర్గాల మధ్య కోల్డ్‌వార్‌తోనే సమాచారం పోలీసులకు చేరిందని, ఇప్పుడే ఇలా ఉంటే మున్ముందు బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి పేరు ప్రకటించిన అనంతరం ఇంకెలా ఉంటుందోనని పార్టీ వారు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

**సీజ్ చేసిన పోలీసులు...**

బీజేపీ జిల్లా అధ్యక్షుడి ఇంట్లో చీరలు నిల్వ ఉన్నాయనే పక్కా సమాచారంతో ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్, ఎస్ఐ రాజేందర్, మంచిర్యాల సీఐ ముమ్మె రాజు, పట్టణ ఎస్ఐ జగదీశ్ సిబ్బంది కలిసి రఘునాథ్ ఇంటిపై దాడులు చేసి 720 చీరలు స్వాధీనం చేసుకొని సీజ్ చేశారు. ఈ సందర్భంగా సీఐ రాజు మాట్లాడుతూ చీరలకు సంబంధించి ఆధారాలు 2 రోజుల్లో సమర్పించాలని కోరామని, లేకుంటే కేసు నమోదు చేస్తామని తెలియజేశారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
WANTED
jobs Apply Now!
★రామకృష్ణ గ్రూప్ Hyd, VJA శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల సేవకు, బేబి కేర్, ఇంటి/ వంటపని చేయుటకు వర్కర్స్ కావలెను. భో॥ + వ॥ + జీతం: 15-22 వేలు. ఏజెంట్లకు 5000/- కమీషన్. ఫోన్: 9281452833, 9281452844.
NT-320501-All

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677